బకాయిలు చెల్లించాలి

- ఆస్తిపన్ను చెల్లించండి.. అభివృద్ధికి సహకరించండి
- వన్‌టైం సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జోన్ వ్యాప్తంగా రూ.123.09కోట్ల బకాయిలు
- రోజువారీ టార్గెట్లతో ముందుకెళ్లున్న అధికారులు

ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయం

ఎల్బీనగర్, మార్చి 19: ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు యుద్ధప్రాతిపదికన రోజువారీ టార్గెట్లతో ముందుకు సాగుతున్నారు. పాత బకాయిలపై వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీని కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు అందిస్తుండటంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలో కలిపి టార్గెట్ రూ.320.94కోట్లు ఉండగా.. ఫిబ్రవరి మాసాంతం వరకు అధికారులు రూ.197.63కోట్లు వసూళ్లు చేశారు. ఇక మార్చి మాసాంతం వరకు మొత్తం రూ.123.09కోట్లు వసూళ్లు చేయాల్సి ఉంది. అయితే అధికారులు ఇప్పటి వరకు ఐదు సర్కిళ్లలో కలిపి రూ.8.29కోట్లను వసూళ్లు చేశారు. మార్చి 31వ తేదీ వరకు గడువు దగ్గర పడుతుండటంతో అధికారులు టాక్స్ వసూళ్లపై మరింత వేగం పెంచారు. రోజువారీగా టాక్స్ కలెక్షన్ టార్గెట్లు పెట్టుకుని వసూళ్లలో ముందుకు సాగుతున్నారు. ప్రధానంగా వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకుని టాక్స్‌లు చెల్లిస్తే 90 శాతం వడ్డీపై రాయితీ ఉన్నందున దానిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులు కోరుతున్నారు. సర్కిళ్ల వారీగా తీసుకుంటే కాప్రా సర్కిల్‌లో రూ.19.49కోట్లు, ఉప్పల్ సర్కిల్‌లో రూ.16.18కోట్లు, హయత్‌నగర్‌లో రూ.25.98కోట్లు, ఎల్బీనగర్‌లో రూ.22.97కోట్లు, సరూర్‌నగర్ సర్కిల్‌లో రూ.30.18కోట్ల బకాయిలు ఉన్నాయి. ఆస్తిపన్ను బకాయిలను పకడ్బందీగా వసూళ్లు చేసేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన ముందుకు సాగుతున్నారు. మార్చి 31 నాటికి ఆస్తిపన్నులను సంపూర్ణంగా వసూళ్లు చేయాలన్న లక్ష్యంతో వారు ఉన్నారు.

రంగనాయకులగుట్ట కాలనీలో చెత్తాచెదారం తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

హయత్‌నగర్, మార్చి 19: డివిజన్‌లోని కాలనీల్లో దోమల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్‌లోని రంగనాయకులగుట్ట కాలనీలోని వరదనీటి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడం వంటి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులు ఇళ్లలోని తడిపొడి చెత్తను వేరుచేసి ఇంటి ముందుకు వచ్చే చెత్తా రిక్షాల్లోనే వేయాలని కోరారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో పడేయడం వల్ల కుళ్లిపోయి దోమలు పెరిగి దుర్వాసనతో పాటు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. ఆయన వెంట ఏఈ చంద్రశేఖర్, కాలనీవాసులు మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన క్రీతి మిశ్రాను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలి

ఎల్బీనగర్/వనస్థలిపురం, మార్చి 19: క్రీడాకారులు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆగ్రాలో జరిగిన పదదో వరల్డ్ క్రాస్బో ఘాటింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలో బంగారు పతకం సాధించిన వనస్థలిపురం డివిజన్‌కు చెందిన క్రితి మిశ్రా మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలు దేశాల నుంచి పలు క్రీడాకారులు పాల్గొన్న ఈ క్రీడలో అందరిని తట్టుకొని డబల్ గోల్డ్ మెడల్ సాధించడం తెలంగాణకు గర్వకరణమన్నారు. తన నియోజకవర్గానికి చెందిన క్రీడాకారిణి బంగారు పతకం సాధించడం సంతోషించదగ్గ విషయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు రాధేశ్యామ్, సునీత, నాయకులు దూసరి మధుగౌడ్, రాజిరెడ్డి, విఠల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

స్వరాజ్యం అడుగుజాడల్లో నడవాలి

కందుకూరు, మార్చి 19: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం అడుగు జాడల్లో నడవాలని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్ తెలిపారు. మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురస్కరించుకొని మండల కమిటీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం బాల్యంలోనే తుపాకిని చేతపట్టుకొని గెరిల్లా పోరాటంలో చేరి తెలంగాణ రాష్ట్రంలో అనేక భూములు పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఆర్.చందు, కుమార్, నాయకులు శేఖర్, రమణి, సుజాత పాల్గొన్నారు.

కందుకూరులో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాశ్, చైతన్యపురి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వినోద్ యాదవ్, కొత్తపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజేశ్ తదితరులు. – ఎల్బీనగర్, మార్చి 19

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ఎల్బీనగర్, మార్చి 19: సరూర్‌నగర్ చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 నుంచి 50 ఏండ్ల వయస్సు గల ఓ మహిళ మృతదేహం చెరువులో నీటిపై తేలిన సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతురాలి వంటిపై లేత ఆకుపచ్చ రంగు దుస్తువులు ఉన్నాయని, పైన నల్లటి బుర్కా ధరించి ఉందని తెలిపారు. చేతికి ఆకుపచ్చ గాజులు, కుడికాలికి నల్లటి దారం ధరించి ఉందని తెలిపారు. సదరు మహిళా సమాచారం తెలిస్తే సరూర్‌నగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా..

శంషాబాద్ రూరల్, మార్చి 19: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలను కొనసాగిస్తున్న ట్రినేట్రి మోడల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పాఠశాల ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాల యాజమాన్యం ఈనెల 15 నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాలను నిర్వహించాలని ఆదేశాలు ఉన్నా వాటిని పట్టించకోకుండా సాయంత్రం వరకు నడిపించడమే కాకుండా పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, దుస్తులు, బూట్లు ఇతర సామగ్రిని అమ్ముతూ పూర్తిగా వ్యాపారంగా మార్చారని వివరించారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలలో అమ్ముతున్న పాఠ్యపుస్తకాలను విద్యాశాఖ అధికారులు సహకారంతో ఎంఈవో కార్యాలయానికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 19: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు బిల్డింగ్ పై నుంచి పడి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కామేష్(19) కాటేదాన్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి బిల్డింగ్ పైన నిద్రిస్తున్నాడు. ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కిందపడి మృతి చెందా డు. ఉదయం లేచి చూడగా కామేష్ రక్తం మడుగులో పడి ఉండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమ్తితం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రఫీతో.. విప్లవాత్మక మార్పు

వ్యవసాయ యూనివర్సిటీ,మార్చి 19: సమాజ పోకడలలో విప్లవాత్మక మార్పు ఫొటో గ్రఫీదని, అనేక అర్థాలు, సమాచారం ఇస్తున్నదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొ. డా. మాధవి రవికుమార్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ విద్యార్థులకు ఫొటోగ్రఫీపై నైపుణ్యత వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక ఫొటో వెయ్యి పదాలకు సమానమని, విద్యార్థులకు ఫొటో గ్రఫీలో గల వివిధ అంశాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ నరేందర్‌రెడ్డి , డా. ఈశ్వరి, డా. సవిత తదితరులు పాల్గొని విద్యార్థులకు ఫొటోగ్రఫీపై అవగాహన కల్పించారు.

తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డి మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి.. కృతజ్ఞతలు తెలిపారు. – బడంగ్‌పేట, మార్చి 19

రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేశ్, బండి మధుసుదన్‌రావు, తలాటి రమేశ్, బండి గోపాల్‌రావ్, సంగం రమేశ్, మదన్‌మోహన్‌రాజు తదితరులు ఉన్నారు. – ఆర్కేపురం, మార్చి 19

మరిన్ని పరిశోధనలు చేపట్టాలి

- ప్రముఖ పేటెంట్ నిపుణులు శుభాజిత్‌సాహ

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 19 : ఉద్యాన రంగంలో మేథో సంపత్తి హక్కులతో ఉపాధి అవకాశాలు మెరుగు, అధిక అవకాశాలు, ఆదాయం మెరుగవుతాయని ప్రముఖ పేటెంట్ నిపుణులు శుభాజిత్‌సాహ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యాన రంగంలో మేథో సంపతి హక్కుల ఆవిష్కరణతో అధిక ఆదాయం లభించనున్నదని, తెలంగాణలో అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నాయని వాటిలో మేథో సంపత్తిని హక్కులుగా మార్చేందుకు సిద్ధం కావాలని సూచించారు. భౌగోళిక గుర్తింపునకు అనువైన అంశాలు, విధానం పొందిన ఉత్పత్తుల వివరాలు దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు, పంటలలో రైతులు, 20-30 శాతం అధిక లాభాలు, మార్కెట్ ధరలు పొందుతున్నారన్నారు. మరో 8 నుంచి 10 ఉద్యాన పంటలు భౌగోళిక గుర్తింపునకు అనువుగా ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయాలు, రైతులు, ప్రభుత్వం కలిసికట్టుగా ముందుకొస్తే రాష్ట్రం నుంచి అనేక ఉత్పత్తులను భౌగోళిక గుర్తింపులు ఉన్న ప్రదేశాలలో టూరిజంకు అవకాశాలు ఉంటాయన్నారు. డీన్ డా, రాజశేఖర్ మాట్లాడుతూ.. పరిశోధనలో సృజనాత్మకత అంశాలు రైతులకు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వెతికే దిశగా పరిశోధన చేపట్టాలని సూచించారు.

పబ్లిక్ స్కూల్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తున్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రామంతాపూర్,మార్చి 19: హైదరాబాద్, బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి చదివేందుకు ముగ్గురు షెడ్యూల్ కులాల విద్యార్థులు ఎంపికైనారు. 2024,25 సంవత్సరానికి గాను 1వ తరగతిలో ప్రవేశాలకు 29 మంది షెడ్యూల్ కులాల బాల బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కార్యాలయంలో లక్కీడిప్ ద్వారా ముగ్గురు విద్యార్థులు మిథాలి రాజ్ బేగంపేట,ఆద్యవల్లింపుల బేగంపేట, నీతికఆము రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రామారావు,తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

చిప్పలపల్లి గ్రామ మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

కందుకూరు, మార్చి 19: చిప్పలపల్లి గ్రామ మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడిగా అంబటి కృష్ణా ముదిరాజ్ ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి ఖదీర్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా మామిళ్ల రాజు ముదిరాజ్, కార్యదర్శిగా పొలెమోని సురేశ్ ముదిరాజ్, డైరెక్టర్లుగా గోపాల్ దాస్ జంగయ్య, అంబటి యాదిగిరి ముదిరాజ్, పొలెమోని రమేశ్ ముదిరాజ్, మిద్దెల రవి ముదిరాజ్, దిద్దెల లక్ష్మయ్య ముదిరాజ్, మామిళ్ల ప్రవీణ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు.

కల్తీ ఉత్పత్తులపై .. ఎస్‌వోటీ దాడులు

శంషాబాద్ రూరల్, మార్చి 19 : ఆహార ఉత్పత్తుల కల్తీ నిల్వలు చేయడమే కాకుండా వాటిని అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు సదరు నిల్వలపై దాడులు చేశారు. అక్రమంగా నిల్వ చేసిన వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ వ్యక్తిని అరెస్టు చేసి ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని సింప్లెక్స్ సమీపంలో బాలాజీ కంపెనీ పేరుతో నకిలీ వస్తువులు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కంపెనీపై దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన, కాలం చెల్లిన ఆహార ఉత్పత్తుల కల్తీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 18 రకాల 771 లీటర్ల సాసులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాలం చెల్లిన వాటిపై కొత్త తేదీలు అతికించి మార్కెట్‌లో అమ్ముతున్న వాటిని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాల్‌రాజు వివరించారు.

ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఎస్‌బీహెచ్ పంచ కాలనీవాసులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి మాదవీలత

సైదాబాద్, మార్చి 19: ధర్మాన్ని నిజాయితీగా ఆచరించే వారందరికీ ప్రకృతి కూడా సహకరిస్తుందని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొంపల్లె మాధవీలత తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఎస్‌బీహెచ్ పంచ కాలనీవాసుల సమావేశాన్ని సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్-జీఏ-2 కాలనీ శ్రీనివాస కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమాజంలో రోజు రోజుకూ అంతరించి పోతున్న ధర్మ పరిరక్షణను జాగృతం చేయటం కోసమే తాను హైదరాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్నానని, హైందవ ధర్మాన్ని కాపాడుతూ మందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాతబస్తీలో సనాతన ధర్మాన్ని మరింతగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను ధర్మం వైపు నడిపించటమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, బీజేపీ నాయకులు కొత్త కాపు రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మడిగల లక్ష్మారెడ్డి, నవీన్‌రెడ్డి, వినోద్, పంచ కాలనీల ప్రతినిధులు కృష్ణమురళీ, డాక్టర్ ఉదయ్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు జైలు శిక్ష, జరిమానా

సైదాబాద్, మార్చి 19 : మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న మందుబాబులకు నాంపల్లి తొమ్మిదో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జైలు శిక్షలతో పాటు జరిమానా విధించారని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద్విచక్ర, మూడు చక్రల వాహనాలను మద్యం సేవించిన మత్తులో నడిపి పట్టుబడ్డ తొమ్మిది మందికి జైలు శిక్షతోపాటు రూ.41,100 జరిమానా విధించిందన్నారు. మొదటిసారి పట్టుబడ్డ వ్యక్తి రెండు రోజుల శిక్షతోపాటు రూ.2,100 జరిమానా విధించిందని, అదే విధంగా రెండోసారి పట్టుబడ్డ ఏడు మందికి నాలుగు రోజుల జైలు శిక్షతోపాటు రూ.3,300 జరిమానాను విధించిందని, మూడోసారి పట్టుబడ్డ ఒక వ్యక్తి ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.3,300 జరిమానా విధించినందని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కందుకూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కందుకూరు, మార్చి 19 : ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కందుకూరు సీఐ మక్బూల్ జానీ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు బేగంపేట్, తిమ్మాపూరు, రాచులూరు గ్రామాల్లో సీఏపీఎఫ్ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛగా ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరికి బయపడకుండా తమ ఓటును పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా బెదిరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని.. పోలీసులు రక్షణగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రావణ్ కుమార్. వెంకటయ్య.సైదులు.పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండల్లో హాయ్.. హాయ్

గండిపేట చెరువు.. ఆ పక్కన ఉద్యానవనం.. ఇంకేముంది పర్యాటకులను ఆకర్షిస్తున్నది. మండువేసవిలో కూడా గండిపేట చెరువు నీళ్లతో కళకళలాడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చెరువు పక్కన ఏర్పాటు చేసిన పార్కు పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. దానిలో భాగంగా మంగళవారం ఇలా సేద తీరుతూ.. ఫొటోలు దిగుతూ ఆనందంలో పరవశించిపోతున్నారు.

బహిరంగ ప్రకటన

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్, జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా
ఓ.ఎస్.నెం.42/2019

జుట్మీన్:
శ్రీమతి శాగంటి వెంకటమ్మ ... వాది
మరియు
శ్రీమతి శాగంటి హైమావతి మరియు ఇతరులు ... ప్రతివాదులు

పై కేసును శ్రీ శాగంటి వెంకటమ్మ భర్త కీ.శే. కేశవరెడ్డి, నివాసము: గోప్లాపూర్ గ్రామం, జడ్చర్ల మండలము గారు, గోప్లాపూర్ గ్రామ శివారులోని సర్వే నెం.184లో గల భూమిలోని విస్తీర్ణము ఎ.2-00 గుం.ల భూమికి సంబంధించి సివిల్ దావా ఓ.ఎస్.నెం. 42/2019 కేసు వేయడం జరిగినది. ఇట్టి కేసులో ప్రతివాదులుగా చేర్చబడిన శ్రీమతి శాగంటి హైమావతి భర్త కీ.శే. శాగంటి యాదవరెడ్డి, నివాసము: ఫ్లాట్ నెం. 404, జీజయ్ కాస్టీ అపార్టమెంట్స్, గ్రీన్ హిల్స్ కాలనీ, రోడ్ నెం.4, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా గారిని పై కేసులో 1వ ప్రతివాదిగా చేర్చడం జరిగినది. పై వారికి కోర్టు ద్వారా సమన్స్ మరియు నోటీసులు అందకపోవడం వల్ల కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా పై కనబర్చిన ప్రతివాదులకు తెలియజేయడం ఏమనగా పై కేసు నందు తమరు ప్రత్యేకంగా గాని తాము నియమించుకున్న న్యాయవాది ద్వారా గాని ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా పైన తెలిపిన కోర్టు వారి ముందు తేది: 02-04-2024 నాడు ఉదయం 10:30ని॥లకు హాజరు కావాల్సిందిగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయునైనది. కావున బహిరంగ ప్రకటనను పురస్కరించుకొని తేది: 02-04-2024 నాడు కోర్టు ముందు హాజరు కాగలరని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. హాజరు కానియెడల తదుపరి చర్యలు తీసుకొనబడును.
తేది:17-03-2024.
ఇట్లు
టి. శ్రీనివాస్ గౌడ్, అడ్వకేట్, ఇంటి నెం. 1-65/2, కోర్టు ఎదురుగా, జడ్చర్ల, మహబూబ్‌నగర్ జిల్లా.
సెల్ : 75:9848804679.